'మెజారిటీ' ఇచ్చిన రెండు పంచాయతీల దత్తత

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవం
- నేటి నుంచి నారా భువనేశ్వరి కుప్పం పర్యటన
- నాలుగు రోజుల పాటు నియోజకవర్గంలోనే..



కంచిబందార్లపల్లెలో సిద్ధమవుతున్న సమావేశ వేదిక

కుప్పం, జూలై 22: ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లే.. చంద్రబాబుకు నియోజకవర్గంలోనే అత్యధిక మెజారిటీ ఓట్లు లభించిన రెండు పంచాయతీలను నారా భువనేశ్వరి దత్తత తీసుకోనున్నారు. ఈ మేరకు కుప్పంలో మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు సాగే పర్యటనలో అధికారికంగా ప్రకటన చేయనున్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి, మహిళలతో ముఖాముఖిలో పాల్గొని వారి ఆశలు, ఆకాంక్షలు తెలుసుకుని సాధికారత దిశగా నడపడానికి తన పర్యటనను ఎంచుకున్నారు. ఎన్నికల ముందు ఆమె ఎన్నో వరాలు కురిపించారు. అందులో అందులో ముఖ్యమైనది అత్యధిక మెజారిటీ సాధించిన పంచాయతీలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం. ఈ క్రమంలో గుడుపల్లె మండలం కంచిబందార్లపల్లె, పైపాళ్యం పంచాయతీలను దత్తత తీసుకోవడానికి ఇప్పటికే నిర్ణయించారు. కంచిబందార్లపల్లె పంచాయతీ పరిధిలోని 113, 114 పోలింగ్ కేంద్రాల్లో చంద్రబాబుకు 1059 ఓట్లు.. పైపాళ్యం పంచాయతీ పరిధిలోని 223, 224 పోలింగ్ బూతుల్లో 1248 ఓట్ల మెజారిటీ లభించింది. మొత్తం ఓట్లు, పోలైన ఓట్లు, మెజారిటీ శాతాలను బట్టి ఈ రెండు పంచాయతీలను ఎంపిక చేసుకున్నారు. వీటిని దత్తత తీసుకుని రోడ్లు, కాలువలు, తాగునీటి సదుపాయాలు కల్పించనున్నారు. ఆయా పంచాయతీల పరిధిలోని ఉపాధి అవకాశాలను పంచడంతో పాటు, అక్కడి మహిళల ఆర్థిక స్వావలంబనకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టనున్నారు. కుప్పంలో యువత నైపుణ్యాలను పెంచడానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నారా భువనేశ్వరి ప్రారంభిస్తారు. మరోవైపు నియోజకవర్గ ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలపనున్నారు. మారుమూల గ్రామాల్లోనూ పర్యటించి అభివృద్ధిపై హామీ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఆమె ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా కుప్పంలో ఒక క్లినిక్‌ను ఏర్పాటు చేయడంతోపాటు, ఉచిత మొబైల్ వైద్యశాల నిర్వహిస్తున్నారు.

ఏర్పాట్లలో టీడీపీ శ్రేణులు నిమగ్నం

నారా భువనేశ్వరి రాక నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తొలుత గుడుపల్లె మండలంలోని కంచిబందార్లపల్లె పంచాయతీకి వెళ్లి దత్తతను ప్రకటించడమే కాకుండా అక్కడి మహిళలతో ఆమె ముఖాముఖిలో పాల్గొనున్నారు. అందుకని అక్కడ వేదిక ఏర్పాటుతో పాటు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ కూడా సోమవారం చేపట్టారు. మొదటిరోజు మొత్తం గుడుపల్లె మండలంలోనే ఆమె గడపనుండడంతో ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు కుప్పంలోని టీడీపీ కార్యాలయంలో భువనేశ్వరి పర్యటన ముందస్తు ఏర్పాట్లపై సోమవారం పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో ఆమె పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఈ సందర్భంగా రాజ్‌కుమార్ కోరారు.



కుప్పంలో టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

నేటి షెడ్యూల్

గుడుపల్లె మండలం కమ్మగుట్టపల్లెకు మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుకుంటారు. అక్కడి మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. తాను దత్తత తీసుకోనున్న కంచిబందార్లపల్లెకు మధ్యాహ్నం 2.15 చేరుకుని 3.15 గంటలదాకా మహిళలతో సమావేశమవుతారు. గుత్తార్లపల్లెలో మధ్యాహ్నం 3.30 నుంచి 4.30 గంటల దాకా మహిళలతో సమావేశమవుతారు. కోటపల్లి గ్రామంలో సాయంత్రం 4.45 నుంచి 5.45 గంటల దాకా సమావేశమై వారి సాధకబాధకాలు అడిగి తెలుసుకుంటారు. అనంతరం కుప్పంలోని పీఈఎస్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని బస చేస్తారు.

పుంగనూరులో భద్రమేనా?

- కార్యాలయం ఒకచోట.. రెవెన్యూ రికార్డుల గది మరోచోట
- భద్రతలేని చోటే విలువైన డాక్యుమెంట్లు

వైసీపీ ఘోరపరాజయం చెందింది. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని పలుచోట్ల ఫైళ్లు కాల్చేస్తున్నారు. గత ఐదేళ్లలో తాము చేసిన తప్పులు బయటపడకుండా ఉద్యోగులు, నేతలు కుమ్మక్కై ఈ చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. తాజాగా మదనపల్లె సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఆదివారం రాత్రి మంటలు చెలరేగి.. కీలకమైన రికార్డులు కాలిపోయాయి. ఈ ఘటనను సోమవారం పరిశీలించిన డీజీపీ ద్వారకాతిరుమలరావు ఇది ప్రమాదం కాదని స్పష్టంచేశారు. ఎవరో ఉద్దేశపూర్వకంగా కాల్చేశారని, దీనివెనుక పెద్ద కుట్ర ఉన్నట్లు అర్థమవుతుంది. ఈ క్రమంలో పుంగనూరులో రికార్డుల భద్రత అంశం తెరపైకి వచ్చింది.

\- పుంగనూరు

స్వాతంత్య్రం అనంతరం, జమీందారీ పాలన కాలానికి చెందిన విలువైన రెవెన్యూ ఆస్తుల రికార్డులున్న పుంగనూరు రికార్డు గది భద్రతపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయి. పూర్వపు తాలూకా కేంద్రమైన పుంగనూరు నుంచే నాటి జమీందారులు పాలన సాగించి అనేక చెరువులు, ఆలయాలు నిర్మించారు. అభివృద్ధి పనులు చేశారు. వారి అధీనంలో వేల ఎకరాల్లో భూములు ఉండేవి. విలువైన భూములు, ఆస్తులకు చెందిన రికార్డులన్నీ రాతిమసీదు వీధిలోని పుంగనూరు తహసీల్దారు కార్యాలయంలోని రికార్డు గదిలో 1948 నుంచి భద్రపరిచారు. రెవెన్యూ రికార్డులు ఎఫ్ఎల్ఆర్ (ఫేర్‌ల్యాండ్ రికార్డు), ఎస్ఎల్ఆర్ (సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డు), ఇళ్లస్థలాలు, వ్యవసాయ పొలాలు, పొరంబోకు, సెటిల్‌మెంట్ భూములు, అడవులు, దేవదాయశాఖ, వక్ఫ్‌బోర్డు, శోత్రియం భూములు, కీ రిజిస్టర్లు, భూసేకరణ, చెరువులు, వంకలు, కుంటలు, తదితర ముఖ్యమైన విలువైన రికార్డులు భద్రపరిచారు. జమీందారీ పాలనకు సంబంధించిన ప్రాంతాలకు చెందిన భూముల వివరాలన్నీ అందులోనే ఉన్నాయి. గతంలో గ్రామసేవకులు (వీఆర్ఏ) తహసీల్దార్ కార్యాలయాల్లో రాత్రి డ్యూటీలు చేసేవారు. కార్యాలయానికి కాపలాగా ఉండేవారు. కొంతకాలంగా వీఆర్ఏలు ఆ పనులు చేయడంలేదు. పుంగనూరులో గతంలో రాతిమసీదు వీధిలో పూర్వం నుంచి సొంత భవనంలో తహసీల్దారు కార్యాలయం నడుస్తుండేది. గత ఏడాది చివరలో పుంగనూరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఎంపీడీవో కార్యాలయ స్థలంలో మండల పరిషత్ భవనం, దానిపైన తహసీల్దార్ కార్యాలయాలు నిర్మించి తహసీల్దార్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చారు. కానీ అధికారుల నిర్లక్ష్యం, అవగాహనరాహిత్యం వల్ల తహసీల్దార్ కార్యాలయంలో ప్రధానమైన రికార్డు గదిని నిర్మించలేదు. దీంతో పాత కార్యాలయంలోనే విలువైన రికార్డులు అక్కడే ఉండగా, కొత్త భవనంలో తహసీల్దార్ కార్యాలయం నడుస్తోంది. ఏ ముఖ్యమైన రికార్డు కావాలన్నా పాత కార్యాలయానికి వెళ్లాల్సివస్తోంది.



పుంగనూరు తహసీల్దార్ కార్యాలయ రికార్డు గది

ఇటీవలే తాళం వేయించాం

పాత తహసీల్దారు కార్యాలయంలోని రికార్డుగదికి ఇటీవలే తాళం వేయించి నా వద్దే పెట్టుకున్నా. మంగళవారం పుంగనూరు పోలీసులకు లేఖ రాసి ప్రతిరోజు రికార్డు గదికి రక్షణ కల్పించేలా గార్డును ఏర్పాటు చేయాలని సూచిస్తా.

\- శివయ్య, తహసీల్దారు





రికార్డు గదిలోకి వెళ్లే మొదటి తలుపు దుస్థితి - రికార్డుగది వెనుక తలుపు ఇలా..

తలుపులు దెబ్బతిని..

విలువైన రికార్డులున్న గదికి రాత్రి, పగలు కాపలా ఏర్పాటు చేయలేదు. ప్రధాన గేటు వద్ద వరండా గదికి ఉన్న ఓ తలుపు కొయ్యలు విరిగిపోయాయి. రికార్డు గది వెనుక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా తలుపులు అధ్వాన్నంగా ఉన్నాయి. భద్రతలేని.. దిక్కులేకుండా ఉన్న గదిలోని రికార్డులపై ప్రజల్లో అనేక అనుమానాలు వినిపిస్తున్నాయి. గతంలో కొంతమంది అధికారులు పుంగనూరు, మరికొన్ని ప్రాంతాలకు చెందిన ముఖ్యమైన రికార్డులు మాయం చేయడం, మరికొన్ని రికార్డులు చింపివేయడం, రాజకీయ నేతల ఆదేశాలతో తప్పులు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు నూతన కార్యాలయంలో రికార్డుల నిల్వకు భద్రతాపరమైన ఏర్పాట్లుతో గది నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పంచాయతీలకు మహర్దశ

- అటు సీనరేజ్ సెస్.. ఇటు ఆర్థికసంఘం నిధుల రాక
- త్వరలో ఖాతాల్లో జమకానున్న రూ.40 కోట్లు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 22: వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైపోయిన గ్రామపంచాయతీలకు ఇక మహర్దశ రానుంది. వాటికి పూర్వపు వైభవం తెచ్చే దిశగా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 15వ ఆర్థిక సంఘం నాలుగో విడత నిధులను హాంఫట్ చేస్తే ఇప్పటి కూటమి ప్రభుత్వం వాటిని వెనక్కి ఇవ్వనుంది. ఈ మేర జిల్లాలోన పంచాయతీల ఖాతాల్లో నేడోరేపో రూ.40 కోట్లు జమకానుంది. మరోవైపు సీనరేజ్ ఛార్జీలరూపంలో పంచాయతీలకు నిధులు రానున్నాయి. దీంతో ఆర్థికంగా బలోపేతం కానుంది.

సీనరేజ్ పేరిట వసూలు కానున్న నిధులు

సీనరేజ్ ఛార్జీల రూపంలో టీడీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను పునరుజ్జీవింపచేయనుంది. ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ఇసుక పాలసీ స్థానిక సంస్థలకు ఆర్థిక దోహదం చేయనుంది. ఇసుక, గ్రానైట్, కంకర క్రషింగ్ వంటి వాటికి తప్పనిసరిగా సీనరేజి ఛార్జీల పేరుతో ప్రభుత్వం ప్రత్యేకంగా వసూలు చేస్తుంది. ఈ విధంగా వసూలయ్యే మొత్తాన్ని ఆయా ఆర్థిక సంవత్సర చివర్లో వాటాల రూపేణ జడ్పీకి 25శాతం, గ్రామపంచాయతీలకు 50శాతం, మండల పరిషత్‌లకు 25శాతం బదిలీచేస్తుంది. మైనింగ్ కార్యక్రమాలు కొనసాగే పంచాయతీలకు మాత్రమే సీనరేజ్ వాటా వస్తుంది. వీటితో పాటు ఇసుక, కంకర, మట్టి ఉపయోగించి నిర్మించే రహదారులు, సీసీ రోడ్లు, చెరువుల మరమ్మతులు వంటి పనుల్లోనుంచి కాంట్రాక్టర్ల ద్వారా సీనరేజ్ ఛార్జీలు ప్రభుత్వం వసూలు చేస్తుంది. ఇంజినీర్లు బిల్లులు తయారుచేసేటప్పుడే ఈ చార్జీలను ఎస్టిమేట్లలో పొందుపరుస్తారు. ఈ పనులు జరిగే గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు, జడ్పీలకు దామాషా మేరకు జమ అవుతాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇటువంటి సీనరేజ్ ఛార్జీలు, సెస్ ఏ గ్రామ పంచాయతీలకు కూడా జమకాలేదు. ఇసుక కాంట్రాక్టర్ల నుంచి పెద్దమొత్తంలో వసూలు చేసిన ఈ సీనరేజ్ ఛార్జీలు ఎక్కడ జమ అయ్యాయో తెలియడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అమల్లోకి తీసుకురావడంతో కేవలం సీనరేజ్ ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. వసూలు చేసిన సీనరేజ్ ఛార్జీలను స్థానిక సంస్థలకు జమచేస్తారు. కాగా గత వైసీపీ ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామపంచాయతీలకు చెల్లించకుండా దారి మళ్ళించిన విషయం తెల్సిందే. ఈ నిధుల నుంచి రూ.250 కోట్ల మేర నిధులు పంచాయతీలకు మళ్ళిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లాకు సుమారు రూ.40 కోట్లు నాల్గవ విడత కింద త్వరలో రానున్నాయి. గత ఐదేళ్ళకాలంలో వివిధ పద్దుల క్రింద గత వైసీపీ ప్రభుత్వం బకాయి పడ్డ మిగతా నిధులను కూడా త్వరితగతిన విడుదల చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్ కోరారు. నిధుల రాకతో పంచాయతీలు బలోపతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

గజ దాడులతో పంటలకు నష్టం



ఇరికిపెంట చెన్నపట్నం చెరువు సమీపంలో టమోటాలను తొక్కేసిన ఏనుగులు



అన్నెమ్మగారిపల్లె సమీపంలో నేల రాలిన మామిడి కాయలు

సోమల, జూలై 22: సోమల మండలం అన్నెమ్మగారిపల్లె, ఇరికిపెంట పంచాయతీల్లో ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు పొలాల్లో సంచరించాయి. పలు పంటలను ధ్వంసం చేశాయి. రెండు రోజులుగా బోనమంద, రెడ్డివారిపల్లె ప్రాంతాల్లో సంచరించిన ఏనుగులు ఇరికిపెంటకు చెందిన బురస దశన్న పొలం వద్ద ఆదివారం టమోటాలు కోత చేసి సోమవారం ఉదయం మార్కెట్‌కు తరలించేందుకు 120టమోటా బాక్సులు నిల్వ చేశారు. ఏనుగుల మంద ఆ టమోటా బాక్సులను తొక్కేసి, నీటి డ్రమ్‌లను, టమోటాలను నాశనం చేశాయి. సుమారు రూ. లక్ష విలువ చేసే పంటను నష్టపరిచాయని రైతు వాపోయారు. మునిరాజుల నాయుడు షెడ్డును కూల్చివేశాయి. శ్రీనివాసులునాయుడు, సతీశ్ టమోటా తోటలో పంటను తొక్కివేసి ఊతంగా నాటిన కర్రలను నాశనం చేశాయి. టమోటాకు మంచి గిట్టుబాటు ధరలు ఉండి ఏనుగుల దాడులతో లక్షలు విలువ చేసే తోటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. అన్నెమ్మగారిపల్లె పరిసర ప్రాంతంలోనూ టమోటా, కొబ్బరి, వరి, మామిడి తోటల్లో సంచరించాయి. వరినార్లు నాట్లుకు సిద్ధంగా ఉండి ధ్వంసం కావడంతో దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. అలాగే చిన్నకంపల్లెకి చెందిన బాలాజీనాయుడు మామిడితోటలో నీలం కాయలు కోతలకు సిద్ధంగా ఉన్న చెట్లను ధ్వంసం చేయడంతో నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ శాఖ సిబ్బందికి సమాచారం తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జిల్లా అటవీశాఖ అధికారులకు ఫిర్యాదుచేశారు. మామిడి తోటలు ధ్వంసం కావడం, డ్రిప్‌పైపులు, టమోటా తోటలు కోల్పోయినవారికి నష్టపరిహారం అందజేయాలని సోమవారం ఉద్యానశాఖ అధికారులను కోరారు.

ఇసుక లభ్యత ప్రాంతాలను గుర్తించండి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 22: జిల్లాలో ఇసుక లభ్యత ప్రాంతాలను గుర్తించి, వాటి పరిమాణాలపై రూపంలో అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జరిగిన కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. చిత్తూరు మండల పరిధిలో దిగువమాసాపల్లిలో 42,027 ఎంటీఎస్, పాలూరులో 1,39,211 ఎంటీఎస్, బైరెడ్డిపల్లిలో 3,280 ఎంటీఎస్ స్టాక్ అందుబాటులో ఉందన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, మైన్స్ శాఖ డీడీ ప్రసాద్, భూగర్భశాఖ అధికారి గోవర్ధన్‌రెడ్డి, డీపీవో లక్ష్మి పాల్గొన్నారు.

నలుగురు మినహా 27 మంది తహసీల్దార్లకు రిలీవింగ్ ఆర్డర్లు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 22: నలుగురు మినహా మిగిలిన 27 మంది తహసీల్దార్లకు సోమవారం రిలీవింగ్ ఆర్డర్లు జారీ అయ్యాయి. నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో పనిచేస్తున్న నలుగురు తహసీల్దార్లు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన వ్యయ ఖర్చుల వివరాలు ఇవ్వకపోవడంతో వారిని మినహాయించారు. మిగిలిన వారిని రిలీవ్ చేస్తూ సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వారందరూ సాయంత్రం డిప్యూటీ తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించి రిలీవయ్యారు. నేడో, రేపో సొంత జిల్లాలకు వెళ్లి కలెక్టర్లకు జాయినింగ్ రిపోర్టు అందజేస్తారు. కాగా జోన్-4 పరిధిలో చిత్తూరు జిల్లా నుంచి మూడు జిల్లాలకు వెళ్లిన 31 మంది సైతం నేడో రేపో జిల్లా కేంద్రానికి రానున్నారు.

కారుకు నిప్పు పెట్టింది వైసీపీ కార్యకర్తలే

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



ఎస్ఐ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు నదీమ్

పుంగనూరు, జూలై 22: పుంగనూరులో ఆదివారం అర్ధరాత్రి తన కారును వైసీపీ కార్యకర్తలే కాల్చేశారంటూ టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ నదీమ్ సోమవారం ఎస్ఐ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇటీవల మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వద్ద జరిగిన అల్లర్లలో కారు దహనమైన అంశాన్ని ఆయన ప్రస్తావించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆస్తులు, వాహనాలు కాల్చడంతోపాటు ప్రాణాలు తీయాలన్న వైసీపీ నాయకులు ప్రోత్సాహంతోనే ఈ ఘటన జరిగిందన్నారు. వైసీపీ కార్యకర్తలు లడ్డు, మున్నా కలసి పెట్రోల్ పోసి నిప్పు పెట్టారని ఫిర్యాదు పేర్కొన్నారు. సమీపంలోని వారు గట్టిగా కేకలు వేసి నిద్రపోతున్న తమను లేపడంతో ఏమి జరిగిందని చూడగా కారులో నుంచి మంటలు వస్తున్నాయన్నారు. తామంతా కలిసి నీరు పోసి మంటలు అదుపు చేశామని వివరించారు. తన కారుపై ఖాళీ పెట్రోల్ బాటిళ్లు ఉన్నాయని తెలిపారు. ఈమేరకు హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ప్రముఖ న్యాయవాది బి.వెంకటముని యాదవ్, మైనార్టీ నేత సుహేల్‌బాషాలతో వెళ్లి ఘటన గురించి పోలీసులకు వివరించి ఫిర్యాదు చేశారు.

రెచ్చగొడుతున్న వైసీపీ నేతలు: టీడీపీ

'ప్రశాంతంగా ఉన్న పుంగనూరులో వైసీపీ నాయకులు కావాలనే అల్లర్లు సృష్టిస్తున్నారు. టీడీపీ శ్రేణులు ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఉంటే వైసీపీ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనించాల్సిన అవసరం ఉంది. మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వద్ద జరిగిన ఘర్షణలో కొందరి వ్యక్తుల పేర్లు నమోదు చేశారంటూ అనుమానంతో వైసీపీ కార్యకర్తలు నదీమ్ కారు కాల్చారు' అంటూ టీడీపీ నేతలు మండిపడ్డారు. సమావేశంలో టీడీపీ నాయకులు సద్దాం హుస్సేన్, సుబ్బన్న, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీటెక్ డ్యూయెల్ డిగ్రీ కౌన్సెలింగ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22: పద్మావతి యూనివర్సిటీలో బీటెక్ డ్యూయెల్ డిగ్రీ కోర్సులో ప్రవేశానికి కౌన్సెలింగ్ నేడు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సావేరి హాల్లో కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు మూడేళ్ళు పద్మావతి యూనివర్సిటీలోనూ, చివరి ఏడాది స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోనూ చదువుకునే అవకాశం కలుగుతుంది. ఇంటర్‌లో 70 శాతం మార్కులు కలిగి ఆసక్తి ఉన్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చు. సమగ్ర సమాచారం కోసం.. 79959 73878 నెంబరులో సంప్రదించవచ్చని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని సూచించారు.

కరెంట్ బిల్లులు ఫోన్‌తో ఇలా కట్టేద్దాం

క్యూఆర్ కోడ్ అందుబాటులోకి వస్తే ఇంకా సులభం

● వెబ్‌సైట్ ద్వారా ఇలా..



ఎస్పీడీసీఎల్‌కి చెందిన www.apspdcl.in ఓపెన్ చేసి, అందులో పే బిల్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తర్వాత డిటిజల్ పేమెంట్ గేట్‌వే కింద మూడు ఆప్షన్లు బిల్ డెస్క్, ఏపీ ఆన్‌లైన్, టీపీ (ట్రాన్సాక్షన్ అస్యూర్డ్) కనిపిస్తాయి. వీటిల్లో మీకు నచ్చిన పేమెంట్ గేట్‌వేను ఎంపిక చేసుకోవచ్చు. తర్వాత మీ మీటరు నెంబరు ఎంటర్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లు కట్టేయవచ్చు.

ఇదివరకు కరెంటు బిల్లు చెల్లించాలంటే విద్యుత్ కార్యాలయాల వద్దకెళ్లి కట్టేవాళ్లు. ఆ తర్వాత ఆన్‌లైన్, అనంతరం డిజిటల్ పేమెంట్స్ వచ్చాయి. తాజాగా ఇటీవల గూగుల్ పే, ఫోన్‌పే వంటి థర్డ్ పార్టీ యూపీఐ యాప్స్ ద్వారా చెల్లింపులు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈనెల ఒకటో తేదీనుంచి కొత్త ఆర్బీఐ నిబంధనలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు ఇకపై ఏపీఎస్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్ www.apspdcl.in లేదా దానికి సంబంధించిన యాప్ ద్వారానే చెల్లించాలి. ఇటీవల కాలంలో ఫోన్‌పే, గూగుల్ పేలో కరెంటు బిల్లులు చెల్లించడానికి అలవాటు పడిన వినియోగదారులు ఇప్పుడు వాటికి బ్రేక్ వేయడంతో కొంత గందరగోళంలో పడ్డారు. ఫోన్‌పే, గూగుల్ పేలో చెల్లింపులు సులభంగా ఉండడంతోపాటు నెలవారీ బిల్లును రిమైండ్ చేస్తుంది కూడా. ఒక్క క్లిక్‌తో బిల్లు కట్టేయచ్చు. ఇపుడు ఆ అవకాశం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అయితే పక్కరాష్ట్రమైన తెలంగాణలో బిల్లుకింద ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే డెబిట్, క్రెడిట్ కార్డులు, యూపీఐ, నెట్‌బ్యాంకింగ్ తదితర విధానాల్లో బిల్లులు చెల్లించేలా అక్కడ విద్యుత్ సంస్థ పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చింది. అక్కడొచ్చే ఫలితాల ఆధారంగా మనదగ్గర కూడా ఈవిధానాన్ని అమలు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

●ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేనివారు..

ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేని వారు మీ దగ్గరలోని విద్యుత్ కార్యాలయం కానీ, సచివాలయం, మీసేవ కేంద్రానికి వెళ్లి బిల్లు చెల్లించవచ్చు.

- చిత్తూరు రూరల్

● యాప్‌తో ఇలా..



మీఫోన్‌లో ఎస్పీడీసీఎల్ కన్జూమర్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్టర్ మొబైల్ నెంబరు ద్వారా లింకైన విద్యుత్ మీటర్ నెంబరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందులోని 'బిల్ పే' ఆప్షన్ ద్వారా మీ ఫోన్‌లో ఉండే ఫోన్ పే, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లు కట్టేయవచ్చు. ఈ యాప్‌లోనే పేమెంట్ హిస్టరీ, ఏ నెలలో ఎన్ని యూనిట్లు వినియోగించిందీ తెలిసిపోతుంది. అదేవిధంగా కొత్త మీటరు కనెక్షన్ కావాలన్నా ఈ యాప్‌లోనుంచే దరఖాస్తు చేసుకోవచ్చు.

తిరుపతిలో డీజీపీ



తిరుపతి(నేరవిభాగం), జూలై 22: డీజీపీ ద్వారకా తిరుమలరావు తిరుపతి వచ్చారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనపై విచారణ నిమిత్తం వచ్చిన ఆయన అక్కడినుంచి సోమవారం రాత్రి కారులో బయలుదేరి తిరుపతికి చేరుకున్నారు. పోలీసు అతిధి గృహంలో బస చేశారు.

గణిత ప్రజ్ఞాధారణతో విద్యార్థుల్లో నూతన ఆలోచనలు



బాలగణిత అవధానులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులిస్తున్న నిర్వాహకులు

గంగాధరనెల్లూరు, జూలై 22: గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఆలోచనలను రేకెత్తించిందని ఎంఈవోలు కాణిపాకం ఆంజినేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డిలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరంలో భాగంగా మండలంలోని వేపంజేరి హైస్కూల్లో సోమవారం ఏపీ జనవిజ్ఞాన వేదిక విద్యా విభాగం కన్వీనర్, గణిత అవధాని అరుణ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో మంగళపల్లె హైస్కూల్లో సోమవారం గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు హేమ, లహరి, పునిత్‌సాయిలు 200 సంఖ్యలను ఏ క్రమంలో అడిగినా సమాధానాలు అవలీలగా ధారణ చేశారు. మ్యాథ్స్ టీచర్లు వేర్వేరుగా వేసిన ప్రశ్నలకు తడుముకోకుండా సమాధానాలు చెప్పి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. అనంతరం బాలగణిత ప్రజ్ఞాధారణులుగా వ్యవహరించిన వారితో పాటు గణిత అవధాని అరుణ్‌శివప్రసాద్, మ్యాథ్స్ టీచర్లను దేశి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి సన్మానించారు. ఏపీ మ్యాథ్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు చంద్రమనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ సభ్యురాలు స్వప్న, జిల్లా కోశాధికారి మనోహర్, హైస్కూల్ హెచ్ఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన అర్జీలు పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 22: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా గత నెల 25, 26 తేదీల్లో కుప్పం పర్యటనలో సీఎం చంద్రబాబుకు అందిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో అర్జీల పరిష్కారంపై శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ అర్జీలను పరిష్కరిస్తున్నట్లు ఆర్డీవోలు, తహసీల్దార్లు చెప్పారు. పంచాయతీరాజ్ శాఖకు రోడ్లు, ఆలయాల నిర్మాణాలకు అధిక సంఖ్యలో అర్జీలు అందాయని సంబంధిత అధికారి కలెక్టర్‌కు వివరించారు. డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా రచయితల సంఘం నూతన కమిటీ

చిత్తూరు కల్చరల్, జూలై 22: జిల్లా రచయితల సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సోమవారం సుందరయ్యవీధి డాక్టర్ రామలక్ష్మి నర్సింగ్‌హోంలో కట్టమంచి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా గిరిధరన్, ఉపాధ్యక్షులుగా ఎడ్ల బాలకృష్ణారెడ్డి, ఎంవీ.శ్రీధర్ రెడ్డి, అరుణకుమారి, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ రోజాప్రియ, గంటా మోహన్, బి.మునిరత్నం రెడ్డి, సలహా సంఘ సభ్యులుగా వి.హరినాయుడు, బి. మునుస్వామి, మొగిలయ్యశెట్టి, హసీనాబేగం, శ్యామలాదేవి, కార్యదర్శిగా సహదేవనాయుడు, కోశాధికారిగా బాబిలను నియమించారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

ఏపీ పునర్నిర్మాణంలో కేంద్రం భాగస్వామ్యం కావాలి

పార్లమెంటులో ఎంపీ దగ్గుమళ్ల



చిత్తూరు సిటీ, జూలై 22: ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం కావాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. సోమవారం తొలి విడత లోక్‌సభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లోక్ సభలో ప్రథమంగా జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయంలో చిత్తూరు ఎంపీకి మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అధికార బలంలో లాక్కున్న ఇంటి స్థలాన్ని ఇప్పించండి

● కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు బాధితురాలి మొర

చిత్తూరు, జూలై 22: కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 182 అర్జీలు అందాయి. వాటిలో రెవెన్యూకు సంబంధించి 155, పోలీసుశాఖకు 5, మిగిలిన శాఖలకు 22 అర్జీలున్నాయి. ఈకార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, డ్వామాపీడీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని..

● తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకుని రేకుల షెడ్డు వేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని యాదమరి మండలం వరదరాజులపల్లెకు చెందిన హేమలత కోరారు. సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. గత 70 ఏళ్లుగా సర్వే నెంబరులో 216-1లో 3 సెంట్ల ఇంటి స్థలం తన మామ గోపాల్ పేరు మీద ఉండేదని, ఆయన చనిపోయిన తరువాత తనపేరు మీద 1.50 సెంట్లు, మరో 1.50 సెంట్లు తన అత్త శాంతమ్మ పేరు మీద రాసుకున్నామన్నారు. ఈ స్థలాన్ని కన్నయ్య నుంచి కొనుగోలు చేసినటు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తప్పుడు పట్టాను సృష్టించి పోలీసులు, రెవెన్యూ అధికారుల అండతో సురేష్, జయరామన్, ధనంజయ, వెంకటేశ్ కలిసి ఉన్న కాలనీ ఇంటికి కూలదోసి రేకుల షెడ్డు వేశారని ఆరోపించారు. ఇంటి స్థల విషయంపై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. గతంలో అధికార పార్టీ నేతల అండదండలతో తమపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు రికార్డులను పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

● రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు, ముళ్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా రావడంతో రోడ్డు కనపడకపోవడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనపడటం లేదని పూతలపట్టు మండలం ఎగువ, దిగువ కంద్రిగ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గతంలో ముత్తిరేవులు నుంచి షైనగుండ్లపల్లె ద్వారా కాణిపాకం రోడ్డు కలిసే సత్రం వరకు రోడ్డును వేశారన్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా వ్యవసాయ పొలాలు ఉందన్నారు. పొలాల్లో నాటిన చై కొమ్మలు రోడ్డుపైకి రావడంతో ఆర్టీసీ బస్సులకు అడ్డంగా వచ్చిందన్నారు. అలాగే రోడ్డు పక్కలా ముళ్ల చెట్లు కూడా పెరిగి రోడ్డు కనపడకుండా ఉందన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. అధికారులు స్పందించి వాహనదారుల ప్రయాణాలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు.

● టీడీపీ నేతలపై నమోదైన తప్పుడు కేసులకు తక్షణం విముక్తి కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.2019 నుంచి 24 వరకు అప్పటి పోలీసు అధికారులు పథకం ప్రకారం వైసీపీ నేతల ఒత్తిడి మేరకు టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురి చేశారన్నారు. మరికొంత పోలీసు అధికారులైతే ఉద్దేశ్యపూర్వకంగా కేసులు నమోదు చేసి తమ కుటుంబాలను కూడా మానసిక వేధింపులకు గురి చేశారన్నారు. పూతలపట్టు, చిత్తూరు, పుంగనూరు ప్రాంతాల్లో అయితే కుప్పలు తెప్పలుగా 307 కేసులు పెట్టారన్నారు. పూర్తి స్థాయిలో విచారించి అక్రమంగా పెట్టిన కేసుల నుంచి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.



బాధితుల సమస్యలను వింటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

● ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆ సంఘ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, భారతి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 18 నెలలుగా జీతాలు ఇవ్వకపోగా కొత్తగా వచ్చిన ప్రభుత్వం రెండు నెలల జీతాన్ని మాత్రమే ఇచ్చిందన్నారు. ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్‌ను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 16 నెలల వేతనాలను కూడా విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు హనుమంతు, నీలకంఠారెడ్డి, లక్ష్మీదేవి, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

● ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 39 మంది బాధితులు పాల్గొని నేరుగా ఎస్పీ మణికంఠకు తమ సమస్యలను విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలను విన్న ఆయన పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో భూ తగాదాల కింద 16, డబ్బు తగాదాలు 8, కుటుంబ తగాదాలు 5, ఆస్తి తగాదాలు 4, వేధింపులు 3, మిస్సింగ్ 2, ఇంటి తగాదా 1 వంతున అర్జీలు అందాయి.

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ



శోభాయమానంగా ప్రసన్న వేంకటేశ్వరుడి పుష్పయాగం



వడమాలపేట, జూలై 22: అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పుష్పయాగం శోభాయమానంగా జరిగింది. ఆలయంలో గత నెల 17నుంచి 25 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం విధితమే. బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారికలు, అధికారులు, భక్తుల వల్ల తెలిసీ తెలియక లోపాలు జరిగి ఉంటే ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం ఉభయదేవేరులతో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుల వేద మంత్రోత్సారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తులసి, చామంతి, గన్నేరు. మొగలి, సంపంగి రోజా, కలువలు వంటి 11 రకాల పుష్పాలు ఐదు రకాల పత్రాలతో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మహామంగళ హారుతులిచ్చారు. అనంతరం పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎనర్జీ ఆడిట్ జీఎంగా కృష్ణారెడ్డి

తిరుపతి(ఆటోనగర్), జూలై 22: ఆంధ్రప్రదేశ్ సదరన్ డిస్కం ఎనర్జీ ఆడిట్ జనరల్ మేనేజరుగా ఆశాఖ కార్యాలయంలో సోమవారం ఎం.కృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆ స్థానంలో వున్న వెంకట సుబ్బయ్య పదవీ విరమణ చేశారు. దీంతో ఇటీవల తిరుపతి సర్కిల్ ఎస్ఈగా రిలీవ్ అయిన కృష్ణారెడ్డి జీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. కృష్ణారెడ్డికి కార్పొరేట్ కార్యాలయ అధికారులు అయూబ్ ఖాన్, ఈఈలు వాసుదేవరెడ్డి, దామోదరం, శ్రీనివాసమూర్తి, డీఈఈలు జయప్రకాష్, విష్ణువర్ధన్, మునిప్రసాద్, ప్రభాకర్, ఏఈలు గణపతి, వివేకానంద తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



కృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతున్న అధికారులు, ఉద్యోగులు

తిరుమలేశుడి సేవలో సుజయనిధితీర్థ స్వామి

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదరాజ మఠాధిపతి సుజయనిధి తీర్థ స్వామి సోమవారం పెద్దమర్యాదతో తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు చేరుకున్న స్వామికి టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, అర్చక బృందం వెళ్లి శఠగోపం సమర్పించి ఇస్తికాఫల్(ఆలయ మర్యాద) స్వాగతం పలికారు. శిష్యబృందంతో సుజయనిధితీర్థ స్వామి ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు. అదేవిధంగా శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా, సినీనటుడు రాంప్రసాద్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.




సుజయనిధితీర్థ స్వామి - శివప్రతాప్ శుక్లా

గురుకులంలో కలకలం

విద్యార్థిని కన్పించలేదని వెతుకులాట

హాస్టల్ గదిలోనే వున్నట్లు గుర్తింపు

సూళ్లూరుపేట, జూలై 22 : ఓ విద్యార్థిని అదృశ్యమై కొద్ది గంటలకే నిద్రిస్తూ కనిపించిన వైనం కలకలం రేపింది. సూళ్లూరుపేటలోని అంబేడ్కర్ గురుకులంలో పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురు ప్రసూన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 8 గంటలకు సదరు విద్యార్థిని క్లాసు ప్రారంభంలో కనిపించింది. 10.50గంటలకు విరామ సమయంలో వెళ్లిన విద్యార్థిని 11 గంటలకు తరగతి గదిలో కనిపించలేదు. సిబ్బంది ప్రిన్సిపాల్‌కు చెప్పడంతో పాఠశాలలో విస్తృతంగా గాలించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక స్వగ్రామంలోని తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థులెవరూ బయటకు వెళ్లలేదని గేట్ వాచ్‌మన్ పోలీసులకు చెప్పాడు. అనుమానంతో హాస్టల్ గదులను పరిశీలించారు. ఆ విద్యార్థిని ఓ గదిలో నిద్రిస్తున్నట్లు గుర్తించారు. బాలికను విచారించారు. సాంఘిక సంక్షేమ గురుకుల డీసీవో పద్మజ రాత్రి పాఠశాలను తనిఖీ చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఫీల్డు అసిస్టెంట్ల తొలగింపులు ఆపేయాలి


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న ఓబుల్‌రాజు

పలమనేరు, జూలై22 : ఫీల్డు అసిస్టెంట్ల అక్రమ తొలగింపులు ఆపాలని సోమ వారం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఓబుల్‌రాజు కోరారు. ఈ మేరకు సోమవారం జేసీకి వినతిపత్రం అందజేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం వందలాది మంది ఫీల్డు అసిస్టెంట్లను తొలగించాలని అధి కారులపై ఒత్తిడి తెచ్చి తొలగిస్తోందని ఫిర్యాదు చేశారు. ఫీల్డు అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్‌ఐ, ప్రమాద బీమాసౌకర్యం కల్పించాలని కోరారు.

విద్యార్థులు కోరిన కోర్సుల్లో అడ్మిషన్లు ఇవ్వాలి

పలమనేరు, జూలై22 : ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో విద్యార్థులు కోరిన కోర్సుల్లో అడ్మిషన్లు ఇవ్వాలని బీసీ ఫ్రంట్ నాయకులు గోవిందస్వామి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆర్డీవో లేకపోవడంతో ఏవోకు అందజేశారు. కొందరు అధ్యాపకులు విద్యార్థులకు వారు కోరిన కోర్సుల్లో కాకుండా ఇతర కోర్సుల్లోనే సీట్లు ఉన్నాయని, ఆ కోర్సుల్లో మాత్రమే చేరాలని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నంజుండప్ప, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'మేము కమీషన్లు ఇవ్వలేదు '


విలేకరుల సమావేశంలో పాల్గొన్న డిస్ట్రిబ్యూటర్లు

పలమనేరు, జూలై22 : సరుకుల కొనుగోలు సందర్భంగా పలమనేరు ది. బాలాజి కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షుడు ఆర్వీఎస్ బోస్ కమీషన్లు తీసు కొన్నారన్న ఆరోపణలను సూపర్‌బజార్‌కు సరుకులు సరఫరా చేసిన కొందరు డిస్ట్రిబ్యూటర్లు ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ తాము సరఫరా చేసే ప్రతి సరుకుకూ సూపర్ బజార్ నుంచే తమ బ్యాంకు ఖాతాలకు నేరుగా చెల్లింపులు ఉంటాయని తెలిపారు. అతితక్కువ ధరకు ప్రజలకు విక్రయాలు చేస్తున్నందున తాము సూపర్ బజార్‌కు కూడా తక్కువ మార్జిన్ పెట్టుకొని సరుకులు సరఫరా చేస్తున్నామే తప్ప ఎటువంటి కమీషన్లు ఇవ్వడం లేదన్నారు.

రాష్ట్ర స్థాయి స్కిప్పింగ్ పోటీలకు సోమల విద్యార్థులు



సోమల, జూలై 22: రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు సోమల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం హరినాథ్ తెలిపారు. ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది. ఈ పోటీల్లో సోమల హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులు రియాన్, రఘునందన్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపిక కావడంతో ఆగస్టు నెల 9, 10, 11 వతేదీలలో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొం టారని పీడీ కరుణానిధి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు జ్యోతీశ్వరుడు, రామాంజులు, అరుణశ్రీ తదితరులు అభినందించారు.

నీటి సమస్య పరిష్కరించాలని ధర్నా


గుడికొత్తురు రోడ్డుపై నీటి కోసం నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

గుడుపల్లె, జులై 22: గుడికొత్తూరులో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు సోమవారం ప్రధాన రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడికొత్తూరులో ఉన్న బోరుబావి నుంచి గ్రామానికి సరఫరా అయ్యే నీరు కొన్నివీధులకు మాత్రమే వస్తుందన్నారు. అధికారులు ట్యాంకర్ నీరు పంపించినా చాలడం లేదన్నారు. దీంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నామని తెలియజేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీలు గ్రామస్తులతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని హామీనిచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

కాశీవిశ్వేశ్వరుడికి అభిషేక పూజలు



కల్లూరు, జూలై 22: పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమ వారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి పాలాభిషేకం, పుష్పాభిషేకం, గంధ మాభిషేకం, విభూదాభిషేకం, కుంకు మాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధరకాల పుష్పాలతో అలంకృతుడైన కాశీవిశ్వేశ్వరుడు విశేషంగా దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అర్చకులు ఫణిప్రకాష్ శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

మల్లేశ్వరస్వామికి హోమపూజలు


హోమం నిర్వహిస్తున్న పండితులు

సోమల, జూలై 22: మండలంలోని ఇరికిపెంట సమీపంలోని మధురమలై కొండలో కొలువుదీరిన మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకపూజలు ఘనంగా నిర్వ హించారు. ఆలయాన్ని విద్యుత్ లైట్లతో, పచ్చని తోరణాలతో అలంకరించారు. ఉదయం ఆలయ ఆవరణలో వేదపండితులు గురుప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ హోమాది కార్యక్రమాలు శాస్త్రోక్తం జరిపారు. పోలూరు శ్రీనివాసులు, చలపతి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ పూజల్లో కోటీశ్వరరావు, జ్యోతీశ్వరనాయుడు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


రాయితీ విత్తనాలు పంపిణీ చేస్తున్న గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, జూలై22: పాడిరైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక పశువైద్యశాలలో రైతులకు రాయితీ పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసం కోసం కిలో మొక్కజొన్న విత్తనాలు రూ.17 ధరతో, జొన్నలు కిలో రూ.23తో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాది


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఉదయకుమార్, జయారెడ్డి

శాంతిపురం, జులై 22 : బిడ్డల బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్య పునాది లాంటిదని మాజీ ఎంపీపీ ఉదయ కుమార్, కెనమాకులపల్లె పంచాయతీ యూనిట్ ఇన్‌చార్జి జయారెడ్డిలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బడుగుమాకులపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యా ర్థులకు పుస్తకాలు, బ్యాగులు, షూస్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వర స్వామికి విశేష పూజలు

రామకుప్పం, జులై 22 : రామకుప్పంలోని అన్నపూర్ణదేవీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. ఉదయం సాయంత్రం పెద్ద ఎత్తున భక్తులు ఆలయాన్ని సందర్శించి అర్చనలు చేయించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహిళపై అత్యాచారయత్నం

చౌడేపల్లె, జూన్22: మహిళలపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ముఖేష్(28) ఈ నెల 19న ఓ వివాహితపై అత్యాచారానికి యత్నించాడు. బాధితులి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఆలయభూమి కబ్జా చేశారని ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పలమనేరు, జూలై22 : మండలంలోని బయప్పగారిపల్లి రెవెన్యూ దాఖలాలోని సర్వేనం. 348లో ఉన్న 1.94 ఎకరాల భూమిలో కొన్నితరాలుగా ఉన్న మారెమ్మగుడి స్థలాన్ని అశోక్ అనే వ్యక్తి కబ్జాచేశాడని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ రంగనాయకులకు ఫిర్యాదు చేశారు. ఆలయం శిథిలావస్థకు చేరుకొందని, దీంతో తాము ఆలయాన్ని పునర్నిర్మించు కొనేందుకు విరాళాలు సేకరించామన్నారు. ఆలయ నిర్మాణానికి పూనుకోవడంతో అశోక్ అడ్డుకుంటున్నాడని ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీనిచ్చారు.

కనకనాశమ్మ ఆలయ బాధ్యతల అప్పగింత



కుప్పం రూరల్, జూలై 22: కుప్పం మండలం పెద్దవంక గ్రామంలో వెలసిన కనకనాశమ్మ ఆలయ నిర్వహణ బాధ్యతలను టీడీపీ నాయకులు స్వీకరించారు. వైసీపీ పార్టీకి చెందిన ఆలయ ఛైర్మన్, ఆ బాధ్యతలను వారికి అప్పగించారు.

వారం రోజుల పాటు శిక్ష సప్తాహ్ కార్యక్రమం


కొలమాసనపల్లి పాఠశాలలో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు, జూలై22 : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి 29 వతేదీ వరకు మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ లీలారాణి తెలిపారు. సోమవారం కొలమాసనపల్లి పాఠశాలలో నూతన జాతీయవిద్యావిధానం లక్ష్యాలను మరింత విస్తృతం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఎంఈఓ లీలారాణి, ఎంఈఓ బాలసుందరం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. తొలిరోజు వివిధరకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అధ్వానంగా డైట్ రోడ్డు

కార్వేటినగరం, జూలై 22: స్థానిక డైట్‌కు వెళ్లే తారు రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. గుంతల్లో నీరు చేరి, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఈ వేగం చాలదు

- అధికారులు మరింత వేగంగా పనిచేయాలి
- కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి
- అధికారులతో కడా పీడీ వికాస్ మర్మత్


ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, జూలై 22: కుప్పం నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికారులు మరింత వేగంగా పనిచేయాలని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. స్థానిక మండల సచివాలయంలో సోమవారం కడా పీడీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటదాకా సచివాలయంలోని సమావేశపు హాలులోనే గడిపారు. నియోజకవర్గ పరిధి లోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఈ వేదికకు హాజరయ్యారు. అయితే ఒకరోజు ముందు మాత్రమే నిర్ణయం తీసుకుని అమలు చేయడంతో సరైన ప్రచారం లేక ప్రజలు అంతగా రాలేదు. సుమారు 15 మంది మాత్రం వివిధ సమస్యలపై కడా పీడీకి ఫిర్యాదులు ఇచ్చారు. సంబంధిత శాఖల అధి కారులను ఆయా సమస్యలు సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పీడీ ఆదేశించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లా డుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కావడంతో అభివృద్ధి విషయంలో ప్రజలకు చాలా అంచనాలు ఉంటాయన్నారు. అధికారులు అందుకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఇప్పుడు పనిచేస్తున్న వేగం చాలదన్నారు. పనితీరులో మరింత వేగం అవసరమన్నారు. స్మార్ట్ కుప్పం మాస్టర్ ప్లాన్ ప్రకారం మౌలిక వసతుల కల్పన ప్రధానమని పీడీ పేర్కొన్నారు. మురుగు కాలువలు, రోడ్లు, తాగునీటి వసతి, ప్రభుత్వాస్పత్రితో పాటు, పీహెచ్‌సీలలో అవసరమైన సదుపాయాలపై నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ విభాగాలలో అవసరమైన సిబ్బంది, వసతులు గుర్తించి నివేదికలు పొందుపరచాలని సూచించారు. ప్రతి సోమవారమూ ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహిస్తామని తెలియజేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ సంతృప్త స్థితికి చేరేలా అధికారుల పనితీరు ఉండాలని స్పష్టం చేశారు. ఆర్డీవో జి.శ్రీనివాసులు, నాలుగు మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథనాయుడు

శాంతిపురం, జులై 22 : ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి వీవీ నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం మండల పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 25న సోమాపురం, కర్లగట్ట, బడుగుమాకులపల్లె గ్రామాలలో భువనేశ్వరి పర్యటించి స్థానిక మహిళలతో సమావేశమై వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకోనున్నారని వారు తెలిపారు. ఆయా గ్రామాలలో సరిగే భువనమ్మ సమావేశాలకు పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు హాజరయ్యేలా నేతలు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కెనమాకులపల్లె యూనిట్ ఇన్‌చార్జి జయారెడ్డి, కేశవులు, రామక్రిష్ణ, ఈడిగ శివశంకర్, పెద్దన్న, రాజారెడ్డి, రాజు, సింగిరి శ్రీనివాసులు, రమష్, జయపాల్, అనుసూయ, చంద్రకళ పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు సహకరించండి : జేసీ


రైతులతో సమావేశమైన జేసీ శ్రీనివాసులు

కుప్పం, జూలై 22: కుప్పంలో పరిశ్రమల ఏర్పాటుకు, ఇప్పటికే ఉన్న కంపెనీల విస్తరణకు రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు కోరారు. ఆయన మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏకార్లపల్లె రైతులతో సమావేశమయ్యారు. గతంలో ఏపీఐఐసీకి సుమారు 200 ఎకరాలను వివిధ పరిశ్రమల కోసం మండల పరిధిలో కేటాయించారు. అందులో ఇతర పరిశ్రమలతోపాటు హిండాల్కో కంపెనీ ఏర్పాటైంది. అయితే తమ పరిశ్రమను విస్తరించడానికి అదనంగా 16 ఎకరాల స్థలం కావాలని కంపెనీ యాజమాన్యం ప్రభుత్వానికి విన్నవించింది. ఈ నేపథ్యంలో జేసీ సంబంధిత రైతులతో సమావేశమయ్యారు. అదనంగా అవసరమైన భూమిని ఇవ్వాలని వారిని కోరారు. మరోమారు సమావేశం ఏర్పాటు చేసి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కుప్పం ఆర్డీవో జి.శ్రీనివాసులు, తహసీల్దారు హరికుమార్ పాల్గొన్నారు.

అక్రమ లేఔట్లపై కఠిన చర్యలు తప్పవు



అక్రమ లేఔట్ వద్ద హెచ్చరిక బోర్డు పెడుతున్న అధికారులు

పెద్దపంజాణి జూన్ 22: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా లేఔట్లు వేస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని పీకేఎం వైస్‌చైర్మన్ బాబర్ హెచ్చరించారు. సోమవారం ఆయన తన సిబ్బందితో మండలంలోని కోగిలేరు పంచాయతీలోని పలమనేరు -పుంగనూరు జాతీయ రహదారి పక్కన వేసిన లేఔట్‌ను పరిశీలించారు. లేఔట్‌కు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేదని గుర్తించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా వేసిన ఈ లేఔట్‌లో ఉన్న ఇంటి స్థలాలను పీకేఎం, పంచాయతీ అనుమతుల వచ్చే వరకు ఎవరూ కొనుగోలు చేయవద్దని పేర్కొన్నారు. అనుమతులు తీసుకోకుండా క్రయ విక్రయాలు జరిపిన యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పీకేఎం సిబ్బంది, స్థానిక సర్పంచ్ రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బోధనాభ్యసన సామగ్రితో నాణ్యమైన బోధన


బోధనాభ్యసన సామగ్రితో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కల్లూరు, జూలై 22: బోధనాభ్యసన సామగ్రితో ఉత్తమ బోధన సాధ్యమవుతుందని పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమ వారం శిక్షా సప్తాహ్ ఏడు రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 2020 సంవత్సరంలో నూతన విద్యా విధానం ప్రారంభించారని, నాల్గవ వార్షికోత్సవ సంబరాల్లో భాగంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. స్థానికంగా లభించే వనరులతో బోధనాభ్యాసన సామగ్రిని తయారు చేసి విద్యార్థులకు వివరిస్తామన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మ కతను వెలికితీసేందుకు ఇది దోహదం చేస్తుందన్నారు. విద్యార్థుల్లో విద్యాభ్యాసం పట్ల ధైర్యం, భరోసా కల్పించవచ్చని తెలిపారు.

అలంకారప్రాయంగా బీఎస్‌ఎన్‌ఎల్ టవర్లు


విజలాపురంలో అలంకారప్రాయంగా ఉన్న బీఎస్ఎన్‌ఎల్ టవర్

రామకుప్పం, జూలై 22: మండలంలో బీఎస్ఎన్‌ఎల్ సెల్ సేవలు అందక గ్రామీణులు అసౌకర్యానికి గురవుతున్నారు. రెండేళ్ల క్రితం వరకు మండలంలో కేవలం రామకుప్పంలో మాత్రమే బీఎస్ఎన్‌ఎల్ సెల్ సేవలు ఉండేవి. గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా సేవలందించాలన్న ఉద్దేశంతో రెండేళ్ల క్రితం మండలంలోని విజలాపురం, గాంధీనగర్. ననియాల, బల్ల, మణీంద్రంలలో సెల్ టవర్లను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ సెల్ టవర్లలో అమర్చేందుకు ఆయా గ్రామాలకు చేరుకున్న పరికరాలను కొద్ది రోజులకే తిరిగి తీసుకెళ్లిపోయారు. దీంతో గ్రామీణ జనం బీఎస్ఎన్‌ఎల్ సేవలు అందక ఇబ్బందులకు గురవుతున్నారు. పలు ప్రైవేటు ఆపరేటర్లు రీచార్జీ ప్లాన్‌ల ధరలను విపరీతంగా పెంచడంతో అదనపు భారాన్ని వారు భరించలేకపోతున్నారు. ఎప్పుడెప్పుడు బీఎస్ఎన్‌ఎల్ సేవలు అందుబాటులోకి వస్తాయోనని వేచి చూస్తున్నారు. అధికారులు స్పందించి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన టవర్ల సేవలు ప్రారంభమయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీవారి ఆశీస్సులు కూటమి పాలనపై ఉండాలి



పాదయాత్రను ప్రారంభిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, జూలై 22: కలియుగ దైవం శ్రీవారి ఆశీస్సులు ఎన్డీయే ప్రభుత్వ పాలనపై ఉండాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబురెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయేకు మంచి మెజారిటీ లభించడం, చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో పులిచెర్ల మండలం ఎల్లంకి వారిపల్లి నుంచి తిరు మలకు టీడీపీ నాయకులు, కార్యకర్తల చేపట్టిన పాదయాత్రను సోమవారం చల్లా బాబు ప్రారం భించారు. ముందుగా వేంకటేశ్వర స్వామి, ఆంజ నేయ స్వామి చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాండు కూడలిలోని టీడీపీ జండాను చల్లా బాబురెడ్డి ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలతో కొంత దూరం పాదయాత్ర చేశారు. తర్వాత మార్గమధ్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమ నాయుడు, సింధు రవి, రెడ్డిబాబుల్లా, రాశిప్రసాద్, సర్పంచ్‌లు షకూర్, మధు, టీడీపీ నాయకులు రామనాథం నాయుడు, రవినాయుడు, కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరమణ, ధనంజయ నాయుడు, మురళీధర్ నాయుడు, గోపినాయుడు, మోహన్‌దాస్, సుబ్రమణ్యంనాయుడు, పూల రమేష్, పురుషోత్తం నాయుడు, ధనంజనాయుడు, సురేష్, నూరుల్లా, అనీల్, కరుణాకర్‌నాయుడు, నాగరాజనాయుడు, అబ్బాస్, అష్రఫ్, ఈఎం రత్నం, దేవ, శంకర్, పార్థు, సురేంద్ర, భాస్కర్, నజీర్, రామ్మూర్తి, రాముపులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పుంగనూరు రూరల్, జూలై 22: ప్రభుత్వం మంజూరు చేసిన నోటు పుస్తకాలను 382మంది విద్యార్థులకు అందజేసినట్లు పుంగనూరు బసవరాజ ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ దయానందరాజు తెలిపారు. సోమవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదువుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పుంగనూరు రూరల్, జూలై22: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముడిపాపనపల్లె వైద్యాధికారి డాక్టర్ తేజశ్రీ తెలిపారు. సోమవారం పుంగనూరు మండలం వనమలదిన్నె పంచాయతీ మీర్లేపల్లెలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల చుట్టు పక్కల పరిశుభ్రత పాటించాలని, వేడినీటిని తాగాలని, నిల్వ ఉంచిన ఆహారపదార్థాలను తినరాదన్నారు. అనంతరం మురుగునీటి కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్, ఫినాయిల్ స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది హరినాథరెడ్డి, ఆనంద్, అపర్ణ, వనిత పాల్గొన్నారు.

వైసీపీ రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలి


మాలమహానాడు జాతీయ నాయకులకు అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేస్తున్న అశోక్‌కుమార్

పుంగనూరు రూరల్, జూలై22: ఎస్సీ, ఎస్టీ కులాలకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన పథకాలను ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరించాలని మాల మహానాడు మహాసభలో తీర్మానించినట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం తిరుపతి యూత్ హాస్టల్‌లో జరిగిన సమావేశంలో దళితుల సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు వర్గీకరణను మళ్లీ తెరపైకి తీసుకువస్తే ఉద్యమాలకు సిద్ధమని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో పుంగనూరు మాలమహానాడు నాయకులు శ్రీనివాసులు, కేశవ, రెడ్డెప్ప పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



పుంగనూరు రూరల్, జూలై 22: పేదలకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం పుంగనూరులో అన్నదానం చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సోమవారం స్థానిక ఇందిరాసర్కిల్ లో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సోమవారం వారపు సంత జరుగుతుందని, సుదూర ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి చిన్న వ్యాపారస్తులు, ప్రజలు వస్తుంటారని వారి కోసం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యం ముఖ్యం


మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసులు

రొంపిచెర్ల, జూలై22: విద్యార్థులకు ఆరోగ్యం ముఖ్యమని ఎంఈవో-2 శ్రీనివాసులు అన్నారు. సోమవారం పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దమల్లెల పాఠశాలలోని 57 మంది పిల్లలకు కంటి, దంత వైద్య పరీక్షలు చేశారు. 20 మందికి కంటి సమస్యలు, 35 మంది దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారికి తగిన సూచనలు ఇచ్చారు. కంటి అద్దాలు ఇస్తామన్నారు. ఉచితంగా మందులు టూత్‌పేస్టు, బ్రష్‌లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంటి, దంత వైద్యులు హేమంత్, రేవంత్, సంధ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.మహేష్ గుప్త, కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, కోశాధికారి చెంగయ్య, సభ్యులు శశిధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్‌పీ కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న మేయర్ అముద

చిత్తూరు, జూలై 22: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని మేయర్ అముద అన్నారు. సోమవారం 39వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు స్కూల్ కిట్స్‌ను అందజేస్తోందన్నారు. హెచ్‌ఎం పార్థసారథి పాల్గొన్నారు.

మామిడి యాజమాన్యంపై నేడు అవగాహన

ఐరాల, జూలై 22: మామిడి కోతల అనంతరం తోటలలో యాజమాన్య పద్ధతులపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఉద్యానవన అధికారి సాగరిక తెలిపారు. యర్లంపల్లె పంచాయతీ దివిటివారిపల్లెకు చెందిన రైతు సుధాకర్ పొలంలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

విద్యా సామగ్రి వితరణ



విజయపురం, జూలై 22: స్థానిక ప్రాథమిక పాఠశాలకు రిటైర్డు హెచ్‌ఎం చంద్రయ్య సోమవారం విద్యా సామగ్రి వితరణ చేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, క్రయాన్స్, పెన్నులు, పెన్సిల్ తదితర సామగ్రి అందించారు. పేద విద్యార్థులను ఆదుకోవడానికి తనవంతు సాయం అందిస్తున్నామన్నారు. పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తం, ఉపాధ్యాయులు ఆనందరెడ్డి, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

విస్తారంగా పచ్చిరొట్ట పంటల సాగు



బూచివానత్తంలో సాగవుతున్న జనుము

విజయపురం, జూలై 22: మండలంలో విస్తారంగా పచ్చిరొట్ట(జనుము) పంటలు సాగవుతున్నాయి. వ్యవసాయాధికారుల సూచన మేరకు బూచివానత్తం, పన్నూరు, కళియంబాకం, ఆలపాకం, జగన్నాథపురం, కాళికాపురం గ్రామాల రైతులు ఎక్కువగా దీన్ని సాగు చేస్తున్నారు. భూమిలో సారం పెంచేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. 50 నుంచి 70 రోజుల్లో దీన్ని భూమిలో కలియదున్నుతారు.

డ్రైడేపై అవగాహన కల్పించాలి



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యాధికారిణి

విజయపురం, జూలై 22 : మండలంలో డ్రై డే గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ప్రాథమిక వైద్యాధికారి సోమశేఖర్ తెలిపారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలకు, ఆశా కార్యకర్తలకు డ్రై డేపై అవగాహన కల్పించారు. మండలంలో జ్వరాలు, డయేరియా రోగుల సంఖ్య చాలా వరకు తగ్గిందని, ఆవాస ప్రాంతాలలో మురుగు నీరు, వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని, రాగి రంగులో మచ్చలు గుర్తిస్తే కుష్ఠు పరీక్షలు చేయించాలని సూచించారు. వైద్యాధికారిణి విష్ణుప్రియ పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన

వెదురుకుప్పం, జూలై 22: దంత సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని వెదురుకుప్పం వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద సూచించారు. సోమవారం కళాశాలలో తిరుపతికి చెందిన దంత కళాశాల వైద్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. నోటి శుభ్రత, దంతాలు, చిగుళ్ల సంరక్షణ తదితరాలపై సిబ్బంది అవగాహన కల్పించారు.

ఆలయాల్లో పాలాభిషేకం



అలంకరణలో నందీశ్వరుడు - సిద్ధేశ్వరుడు

వెదురుకుప్పం, జూలై 22: మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం పాలాభిషేకాలు నిర్వహించారు. డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఎగువ కన్ని కాపురం సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. చవటగుంట ఆవుదేవర నందీశ్వరుడికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

హోంమంత్రిని కలిసిన రాజేశ్వరి



చిత్తూరు సిటీ, జూలై 22: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అనితను కలసి సన్మానించారు. తాజా రాజకీయాలపై చర్చించారు.

శుభ్రత లేని ఆహార విక్రయాలపై ఆగ్రహం

చిత్తూరు, జూలై 22: గంగినేని చెరువు పార్కులోని క్యాంటీన్‌లో శుభ్రత లేని ఆహార పదార్థాలు, తినుబండారాల విక్రయాలపై కమిషనర్ అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంటీన్ నిర్వాహకులకు రూ.5వేలు అపరాధ రుసుం విధించడంతో పాటు నోటీసు జారీ చేశారు. సోమవారం సాయంత్రం ఆమె పార్కును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఓపెన్ జిమ్‌ను పరిశీలించి, పరికరాలను సక్రమంగా ఉంచాలన్నారు. ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి



సరళమ్మ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, జూలై 22: మండలంలోని తుంబకుప్పం అంగన్‌వాడీ కార్యకర్త సరళమ్మ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, రాజకీయ నాయకులు, గ్రామస్తులు నివాళులర్పించారు.

దారి సమస్య పరిష్కరించండి



దళితులతో మాట్లాడుతున్న చెన్నకేశవులు నాయుడు, బాలాజీనాయుడు

గుడిపాల, జూలై 22: మండలంలోని కట్టకిందపల్లి దళితవాడలో ఎన్నో ఏళ్లుగా ఉన్న దారి సమస్యను పరిష్కరించాలని సోమవారం దళితులు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడులకు విన్నవించారు. అధికారులతో చర్చించి, పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. మాజీ జడ్పీటీసీ సుమతి, మాజీ సర్పంచులు ఉదయ, పళని, బాబు, అరుణ్ పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

పాలసముద్రం, జూలై 22: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ప్రస్తుత వర్షాలకు దోమలు పెరిగి వ్యాధులు, విషజ్వరాలు ప్రబలే ప్రమాదముందని, గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని అన్నారు. మంచినీటి పైపులు లీకేజీలుంటే మరమ్మతులు చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. 15 రోజులకొకసారి వాటర్ ట్యాంకులను బ్లీచింగ్ చేయించాలన్నారు. ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

తవణంపల్లె, జూలై 22: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో పారిశుధ్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణులు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. తాగునీటి పైప్‌లైన్లు మరమ్మతులు చేసి, కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మండల పరిషత్ నిధులు.. ఖర్చులపై నిగ్గు తేల్చండి

గంగాధరనెల్లూరు, జూలై 22: మండల పరిషత్‌కు 2021 నుంచి విడుదలైన నిధులు, వాటి ఖర్చులను నిగ్గు తేల్చాలని వైసీపీ నేతలు కోరారు. ఈ మేరకు వారు ఎంపీపీతో పాటు ఎంపీటీసీలు సంతకాలు చేసిన అర్జీని చిత్తూరులో జడ్పీ సీఈవో గ్లోరియాకు సోమవారం అందజేశారు. 2021 సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు ఎవరెవరు ఎంపీడీవోలుగా పనిచేశారు, ఆ సమయంలో విడుదలైన నిధులతో పాటు వాటి ఖర్చులు, మండల పాలకవర్గ తీర్మానాలు నిగ్గు తేల్చాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బుక్కాపట్నం సర్పంచ్ మునిరాజారెడ్డి, వింజం ఎంపీటీసీ హనీఫ్ బాషా, వైసీపీ నేతలు గోవిందరెడ్డి, వెంకటేశులురెడ్డి ఉన్నారు.

అధ్వానంగా డైట్ రోడ్డు



కార్వేటినగరం, జూలై 22: స్థానిక డైట్‌కు వెళ్లే తారు రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. గుంతల్లో నీరు చేరి, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

వేణుగోపాలుడి ఆలయ ప్రాంగణంలో మురుగు నీరు



కార్వేటినగరం, జూలై 22: వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో మురుగునీరు చేరి, భక్తులను అసహనానికి గురిచేస్తున్నాయి. ఆలయం పక్కనే నిర్మించిన డ్రైనేజీలో నీరు పొంగి ప్రాంగణంలోకి చేరుతోంది. ఆలయ సిబ్బంది వీటి గురించి పట్టించుకోకపోవడంతో భక్తులు తొక్కుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా దానిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

బోధన, అభ్యసనా సామగ్రి ప్రదర్శన

కార్వేటినగరం, జూలై 22: డీఎం పురం జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం కేశువులు ఆధ్వర్యంలో సోమవారం శిక్షా సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. సోషల్, మ్యాథ్స్, సైన్స్ పాఠ్యాంశాలకు సంబంధించి సృజనాత్మకతను పెంచే విధంగా తయారు చేసిన బోధన, అభ్యసనా సామగ్రిని విద్యార్థులు ప్రదర్శించారు.

బీసీ నేతలపై విమర్శలు సరికాదు

పెనుమూరు, జూలై 22: బీసీ నేతలను విమర్శించడం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి తగదని టీడీపీ బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ పూజారి భాస్కర్ హితవు పలికారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి టీడీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మొన్నటి ఎన్నికల్లో ప్రజలు తండ్రీకొడుకులను ఓడించినా బుద్ధి రాలేదన్నారు. పార్టీ గెలుపు కోసం రాజన్ కష్టపడడం వల్లే ఆయనకు అధ్యక్ష పదవి దక్కిందని అన్నారు. బీసీలు టీడీపీ వెంట ఉండటం జీర్ణించుకోలేకనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, పార్లమెంటు కార్యదర్శి తలారిరెడ్డెప్ప పాల్గొన్నారు.

22న అభయ్ హిందూసేన సమావేశం

చిత్తూరు కల్చరల్, జూలై 22: కట్టమంచి శాంత రఘురామన్ కల్యాణ మండపంలో ఈనెల 26న అభయ్‌హిందూసేన సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ఈ సమావేశంలో అభయ్ హిందూసేన వ్యవస్థాపకులు రాధా మనోహర్ దాస్ స్వామిజీ పాల్గొంటారని పేర్కొన్నారు.

ఘనంగా గంధోత్సవం

చిత్తూరు కల్చరల్, జూలై 22: ఓబనపల్లె కాలనీలోని ఖుద్రతి చమన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం హజరత్ ఇమామే హసేన్, హజరత్ ఇమామే హుస్సేన్‌ల గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక పూజలు, పీర్ల ఊరేగింపు, అన్నదానం చేశారు. మేయర్ అముద, బుల్లెట్ సురేష్, గురజాల చెన్న కేశవులనాయడు పాల్గొన్నారు.

సీఆర్ రాజన్‌ను విమర్శించడం సరికాదు

గుడిపాల, జూలై 22: టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్‌ను విమర్శించే అర్హత చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి లేదని గుడిపాల మాజీ జడ్పీటీసీ సుమతి మురళీనాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ టీడీపీలో ఆయన చేసిన సేవలను గుర్తించి పదవి అప్పగించారే తప్పా ప్రజలను ఏమార్చి దండుకోలేదని దుయ్యబట్టారు. మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవుపలికారు. నాయకులు పళని, మోహన్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కరువు

- వెలగని వీధి దీపాలు
- బురదగుంటలుగా మారిన రోడ్లు
- ఇళ్ల మధ్య నిలిచిన వర్షపునీరు
- అనారోగ్యం బారిన కాలనీ వాసులు



చీకటిగా ఉన్న ఇందిరమ్మ



బురదమయంగా ఉన్న వీధి



ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

చిత్తూరు సిటీ, జూలై 22 : స్థానిక మురకంబట్టు బైపాస్ రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో 300లకు పైగా ఇళ్లలో 1,500 మందికి పైగా జనాభా ఉన్నా రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, నీటి సౌకర్యాలకు నోచుకోలేదు. రోడ్లు, డ్రైనేజీ లేకపోవడంతో వర్షం పడితే వంకలను తలపించే విధంగా నీరు ప్రవహిస్తోంది. రోడ్లంతా బురదమయంగా మారుతున్నాయి. ఈ వీధుల్లో నడవాలన్నా, ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్నా చాలా ఇబ్బందిగా ఉంటోంది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్ప పడిపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఇళ్ల మధ్యనే నిలువ ఉంటోంది. తద్వారా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దుర్గంధం వెదజల్లుతోంది. తద్వారా కాలనీ వాసులు అనారోగ్యం బారినపడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. చాలా వీధులకు నీటి కొళాయి సౌకర్యం లేకపోవడంతో ట్యాంకర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. మురకంబట్టు నుంచి చెర్లోపల్లె వరకు వేసిన ఎన్‌హెచ్ రోడ్డుకు ఇరువైపులా వీధి దీపాలు ఏర్పాటు చేసి ఏడాది దాటుతున్నా ఇంతవరకు వెలగలేదు. మురకంబట్టు నుంచి ఇందిరమ్మకాలనీకి వచ్చే క్రమంలో చీకటిగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. విషపురుగులు ఎక్కడ వస్తాయోనని భయపడుతూ నడవాల్సి వస్తోంది. హుండాయ్ కార్ షోరూం నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. ఇది ప్రమాదకర మలుపు కావడం, చీకటిగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్‌హెచ్‌లో ఏర్పాటు చేసిన కల్వర్టులు అసంపూర్తిగా ఉండటంతో వర్షపు నీరు ఇళ్ల మధ్యకు చేరుతోంది. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను సకాలంలో పరిష్కరించండి



బాధితులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జూలై 22: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై సంబంధిత అధికారులతో చర్చించారు. పరిష్కరించిన సమస్యలకు సంబంధించిన నివేదికలు అందించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్‌కు 5, పబ్లిక్ హెల్త్‌కు 3, మెప్మాకు 1, రెవెన్యూకు 1 వంతున వినతులు అందాయి. ఏసీ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, మేనేజరు వర్మ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లకు 64 మంది ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఐరాల, జూలై 22: ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలలో 64 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు పీడీ దేవానంద్ తెలిపారు. ఇందులో సీనియర్, జూనియర్ విభాగాల్లో 32 మంది చొప్పున ఉన్నారని పేర్కొన్నారు. సీనియర్ విభాగం క్రీడాకారులు ఆగస్టు 10, 11, 12 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. జూనియర్ క్రీడాకారులు శ్రీకాకుళంలో ఆగస్టు 17, 18, 19తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

జగన్ తీరు అప్రజాస్వామికం : టీడీపీ

వెదురుకుప్పం, జూలై 22: మాజీ సీఎం జగన్ పోలీసుల పట్ల వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేసనూరు మునిచంద్రారెడ్డి విమర్శించారు. సోమవారం వెదురుకుప్పంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ప్రాంగణం వద్ద జగన్ పోలీసు అధికారితో మాట్లాడిన తీరు గర్హనీయమన్నారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఇప్పుడు నీతులు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. టీఎన్‌టీయూసీ జిల్లా నేత గంగయ్య, నాయకులు వి.నాగరాజురెడ్డి, వరప్రసాద్, కోనేరు చెంగల్రాయరెడ్డి, కుమార్, వెంకటేష్ ఆయన వెంట ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు (సెంట్రల్), జూలై 22: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు సోమవారం డీఆర్వో పుల్లయ్య, డీఈవో దేవరాజును కలిసి విజ్ఞప్తి చేశారు. జీవో నంబరు 117 రద్దు చేసి, ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని, హైస్కూళ్లలో రెండు మీడియంలు సమాంతరంగా కొనసాగించి, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. హైస్కూళ్లలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించడంతో పాటు కిలోమీటరు దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, సుధాకర్, రెహనాబేగం, రెడ్డెప్ప, ఏకాంబరం, పార్థసారథి, బాషా పాల్గొన్నారు.

సీఆర్ రాజన్‌పై ఆరోపణలు అర్థరహితం



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

చిత్తూరు సిటీ, జూలై 22: టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్‌పై ఆరోపణలు అర్థరహితమని జిల్లా వన్నియకుల క్షత్రియ సంఘం నేతలు అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ రాజన్‌పై చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యాఖ్యలు ఆయన దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు. బీసీ నేతగా రాజన్ అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారని చెప్పారు. రాజకీయంగా ఆయనను దెబ్బతీయాలనే ఉద్దేశంతో చెవిరెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఇకనైనా ఇలాంటి ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు.

చదువుతోనే ఉన్నత స్థాయి



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

బంగారుపాళ్యం, జూలై 22: విద్యార్థులు బాగా చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని జీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్ నాయుడు, ఎన్‌ఆర్‌ఐ కళ్యాణ్‌లు పేర్కొన్నారు. మండలంలోని కీరమంద, బండ్లదొడ్డి, కొదలమడుగు, రాగిమానిపెంట, కోలావారిండ్లు ప్రాథమిక పాఠశాలల్లో, రాగిమానిపెంట ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ట్రస్టు ద్వారా విద్యాసామగ్రి అందజేశారు. దాతలు మాట్లాడుతూ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలన్నారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ లక్ష్మీబాబు, టీడీపీ నాయకులు మోహన్ నాయుడు, మాధవ నాయుడు, కొండేటి శివ, బుజ్జి, టీచర్లు రఘు, సీఆర్పీ విల్వనాథన్ పాల్గొన్నారు.

మామిడి బోర్డు ఏర్పాటు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

బంగారుపాళ్యం, జూలై 22: బంగారుపాళ్యంలో మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రపంచ మామిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు ఎక్కువగా మామిడి, టమాటా పంటలపై ఆధారపడి జీవిస్తున్నారని, వాటికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. బంగారుపాళ్యంలో మామిడి బోర్డు, పలమనేరులో టమోట బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం రైతు సంఘ నాయకులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉమాపతి నాయుడు, ఉపాధ్యక్షులుగా రాజేంద్ర నాయుడు, వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణారెడ్డి, సహాయ కార్యదర్శులుగా సుగుణ, సురేంద్రరెడ్డిలను ఎన్నుకున్నారు.

రాజవేలు కుటుంబానికి అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, జూలై 22: గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ మండల కార్యదర్శి కిట్టు తండ్రి, సీనియర్ నాయకుడు రాజవేలు కుటుంబానికి అండగా ఉంటామని జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు పేర్కొన్నారు. సోమవారం రాజవేలు భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ రాజవేలు మృతి పార్టీకి తీరని లోటన్నారు. టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, బాలాజీనాయుడు, హేమాద్రి నాయుడు, చంద్రమోహన్, సుమతి, మధుసూదన్ నాయుడు, ఉదయ, జయశీలన్, పళని, జయచంద్ర, మోహన్, ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో గురజాల



చిత్తూరు సిటీ, జూలై 22: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తొలిసారిగా శాసనసభ సమావేశాలకు హాజరయ్యారు. అసెంబ్లీలో తొలిరోజు సోమవారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం ఆసక్తిగా విన్నారు.

నల్గొండ డీసీసీబీ మాజీ సీఈవో మృతి

చిత్తూరు సిటీ, జూలై 22: డీసీసీబీ మాజీ సీఈవో (నల్గొండ), తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ తండ్రి కొల్లా మదన్‌మోహన్ ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం దుర్గానగర్ కాలనీలోని వరుణ్ కుమార్ నివాసంలో మదన్ మోహన్ భౌతికకాయానికి పలువురు టీడీపీ నేతలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

ప్రజాస్వామ్యం గురించి జగన్ మాట్లాడడమేంటి?

గుడిపాల, జూలై 22: గడిచిన ఐదేళ్ల అక్రమాలు, దౌర్జన్యాలతో పాలన సాగించిన జగన్ ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం సిగ్గు చేటని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్‌లు విమర్శించారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఇప్పుడు నీతి వాక్యాలు మాట్లాడడమేమిటని ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లే సమయంలో ఆయన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని అన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు కేటాయించండి



మంత్రి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 22: నగరి, పుత్తూరు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం అమరావతిలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు నిధుల అవసరం ఉందన్నారు. వీటన్నింటినీ సావధానంగా విన్న మంత్రి నారాయణ నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు.

మండలాభివృద్ధికి సహకరించండి



ఎంపీడీవోతో చర్చిస్తున్న చక్రపాణి రెడ్డి

నింద్ర, జూలై 22: నింద్ర మండల అభివృద్ధికి సహకరించాలని శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్, టీడీపీ నేత ఆర్.చక్రపాణి రెడ్డి కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోతో ఆయన సమావేశమయ్యారు. కొప్పేడు సచివాలయ భవన నిర్మాణ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తనకు అందజేయాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకుల తొలగింపునకు సహకరించాలని కోరారు. గత ఐదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి పనులపై ఆర్‌టీఐ కింద సమాచారం అందించాలన్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన తర్వాతే మండలంలో సమావేశాలు, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. చవరంబాకం సర్పంచ్ మనోహర్‌నాయుడు, నాయకులు జగన్, పెరుమాల్ రెడ్డి, భాస్కర్, ఉమాపతి పిళ్లై, జయరాం, పరదేశి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.